సాక్షి తిరుపతి

గురువారం । 3 । ఏప్రిల్ । 2025



'స్లాట్' రిజిస్ట్రేషన్

ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్లాట్ బుకింగ్‌ను తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ప్రారంభించనున్నారు. - 8లో



'భవిత' విద్యార్థికి కలెక్టర్ చేయూత

భవిత కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతుడికి కలెక్టర్ వెంకటేశ్వర్ బ్యాటరీ మోటార్‌సైకిల్‌ను వితరణగా అందించారు. - 8లో



పచ్చమూక చెరలో చింతగుంట చెరువు

చంద్రగిరి మండలంలోని చింతగుంట చెరువును అధికార పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ధాన్యం సేకరణపై అవగాహన



మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ డీఎం పద్మావతి

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరులో ధాన్యం సేకరణపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. సివిల్ సప్లయ్ డీఎం పద్మావతి మాట్లాడుతూ ధాన్యంలో తేమ శాతం 17 కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేసి రైతు సేవా కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. పీఏసీఎస్‌లో రైస్‌మిల్ అస్సైన్ చేయించుకుని ధాన్యం అప్పగించాలని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం 75 కేజీల బస్తాకు రూ.1,740 చొప్పున రైతుల బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తామని వెల్లడించారు. దీనిపై సర్పంచ్ కందాటి మోహనప్రియ మాట్లాడుతూ గత ఏడాది బస్తాకు రూ.2,300 వరకు చెల్లించారని, ఇప్పుడు ఇస్తున్న రేటులో రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ క్రమంలో ధర పెంచి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ షణ్ముగం, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ టి.భారతి పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం


తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం నుంచి తిరుచానూరు జెడ్పీ హైస్కూల్‌లో జవాబు పత్రాల స్పాట్ వాల్యుయేషన్ (మూల్యాంకనం) ప్రక్రియ ప్రారంభమవుతుందని డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాకు 1.85లక్షల జవాబు పత్రాలను మూల్యాంకన నిమిత్తం కేటాయించినట్లు వెల్లడించారు. ఈ నెల 9వ తేదీకి ప్రక్రియ పూర్తవుతుందని, అనంతరం తుది సవరణలు, డేటా ఎంట్రీ, వెరిఫికేషన్ ఉంటాయని వివరించారు. ఈ నెల 20- 25వ తేదీల మధ్య ఫలితాలు వెల్లడించే అవకాశమున్నట్లు తెలిపారు. మూల్యాంకన పర్యవేక్షణకు ఇద్దరు చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు, 130మంది చీఫ్ ఎగ్జామినర్లు, 775మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 260మంది స్పెషల్ అసిస్టెంట్లు, 10మంది అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లను నియమించినట్లు చెప్పారు.ఒక్కో ఎగ్జామినర్ రోజుకు 40 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నట్లు వెల్లడించారు.

కబ్జాలు.. దాడులు.. దౌర్జన్యాలు.. కిడ్నాప్‌లు.. బెదిరింపులతో కూటమి నేతలు పేట్రేగిపోతున్నారు. అక్రమార్జనే లక్ష్యంగా చెలరేగిపోతున్నారు. ఖాళీగా కనిపించిన ప్రభుత్వ భూములను ఆక్రమించేస్తున్నారు. వివాదాస్పద స్థలాల విషయంలో పెద్దమనుషులుగా అవతారమెత్తి అసలుకే ఎసరు పెట్టేస్తున్నారు. అప్పు వసూలు పేరుతో రౌడీయిజం చేస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులందరూ ప్రత్యేక బృందంగా తయారై అందిన కాడికి దోచేసుకుంటున్నారు. మామూళ్లతో అధికారుల కళ్లకు గంతలు కట్టేస్తున్నారు.

రెచ్చిపోతున్న కూటమి నేతలు

- యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా
- ప్రశ్నిస్తే దాడులు.. దౌర్జన్యాలు
- 'భూ'చోళ్లకు సహకరిస్తున్న అధికారులు
- కిడ్నాప్‌లకు సైతం తెగబడుతున్న పచ్చమూక
- వైన్‌షాపు యజమానులకు బెదిరింపులు
- ఇష్టారాజ్యంగా మద్యం దందా

రేణిగుంట మండలం కుర్రకాల్వ వద్ద రియల్ వెంచర్ వేస్తున్న అక్రమార్కులు



కబ్జాలు.. కిడ్నాప్‌లు

దాడులు..దౌర్జన్యాలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూటమి గూండాల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. మధ్యస్తం పేరుతో వివాదాస్పద భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఆక్రమించుకుంటున్నారు. మద్యం దుకాణాల్లో దందాలు, వ్యాపారుల కిడ్నాప్‌లతో ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంపై జనం మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆయా పార్టీల నేతలు అన్ని వర్గాల వారిని వేధిస్తున్నారు.

మద్యం డీలర్లతో ఒప్పందం?

చిత్తూరు నియోజక వర్గ పరిధిలోని షాడో ఎమ్మెల్యే పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా మద్యం దుకాణాల యజమానులను తన కనుసన్నల్లోకి తెచ్చేసుకున్నారు. ఈ క్రమంలోనే మద్యం డీలర్లతో కూడా ఇప్పటికే ఓ ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. డిమాండ్ లేని బ్రాండ్లను అమ్మిస్తామని భరోసా ఇచ్చి కమీషన్ కోరినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఒక పర్యాయం మద్యం డీలర్లతో చర్చలు సాగించినట్లు వైన్‌షాపు యజమానులు ఆరోపిస్తున్నారు. అమ్ముడుపోని బ్రాండ్లను తమకు అంటగట్టి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే జగన్‌మోహన్ పేరు చెప్పి సదరు షాడో ఎమ్మెల్యే బెదిరింపులకు దిగుతున్నట్లు వాపోతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించడపోవడంపై మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే మద్యం డీలర్ల నుంచి కమీషన్లు రాబట్టుకునేందుకు షాడో ఎమ్మెల్యే మరో పర్యాయం సమావేశం కానున్నట్లు సమాచారం.

రంగంలోకి ఐదుగురు

ఇటీవల తిరుపతికి చెందిన ఓ కుటుంబాన్ని కూటమి పార్టీలకు చెందిన గూండాలు కిడ్నాప్ చేసిన విషయం తెలిసింది. చేసిన అప్పు తిరిగి ఇవ్వలేదని అందరినీ ఎత్తుకెళ్లిపోయారు. ఈ ఉదంతంపై సంబంధిత అధికారులు 'మమ' అనిపించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తిరుపతి నగర పరిధిలో వివాదాస్పద భూముల విషయంలో ప్రధానంగా టీడీపీ, జనసేనకు చెందిన ఐదుగురు వ్యక్తులు రంగంలోకి దిగారు. విలువైన స్థలాను ఆక్రమించుకుని పాగా వేస్తున్నారు. అందులో భాగంగా దామినేడు, తిమ్మినాయుడు పాళెం, తిరుపతి అర్బన్ పరిధిలోని దూరదర్శనం కేంద్రం ముందు వెనుక ఉన్న ఫుట్‌పాత్, ఆర్టీసీ బస్టాప్‌కు కేటాయించిన రూ.కోట్లు విలువైన స్థలాలను కబ్జా చేసి దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఈ ఆక్రమణలపై రెండు రోజుల క్రితం సాక్షిలో 'భూచోళ్లు' అనే శీర్షికతో వెలుగులోకి తీసుకువచ్చినా అధికారుల నుంచి స్పందన లేదు.



కుర్రకాల్వ వద్ద వెంచర్‌కు రోడ్డు వేసిన దృశ్యం



రేణిగుంట మండలం కుర్రకాల్వ వద్ద ప్రభుత్వ భూమిని చదును చేయించిన కూటమి నేతలు

ప్రభుత్వ భూమిలో రియల్ ఎస్టేట్

రేణిగుంట మండలం కుర్రకాల్వ పరిధిలో సర్వే నంబర్ 18/1బి 4.21 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రస్తుతం దీని విలువ రూ.కోట్లలో ఉంది. ఈ భూమికి పై భాగంలో చెరువు నిండితే కలుజు ద్వారా నీరు కిందికి ప్రవహిస్తుంది. రేణిగుంట-పాపానాయుడుపేట మార్గంలోని ఈ విలువైన భూమిపై టీడీపీ నేతల కన్నుపడింది. అధికారంలోకి వచ్చిన మరుసటి రోజే ఆ పార్టీ నేతలు రంగంలోకి దిగారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పేరు చెప్పి ఏర్పేడు మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడి సహకారంతో ఈ భూమిని ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. స్థానికులు అడ్డుకుంటే.. ఈ భూమిని 20 ఏళ్ల క్రితమే తాము కొనుగోలు చేసుకున్నామని, ఫ్రీహోల్డ్‌లో రిజిస్ట్రేషన్ కూడా అయ్యిందని సదరు కబ్జాదారులు ఎదురు దాడికి దిగారు. దీనిపై స్థానికులు వెంటనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అలాగే తిరుపతి అర్బన్ మండలం అక్కారంపల్లె సర్వే నంబర్ 112/11లో 273 అంకణాల ప్రభుత్వ భూమిని జనసేన నేతలు ఆక్రమించుకునేందుకు రంగం సిద్ధం చేశారు. సుబ్బారెడ్డి నగర్‌లో నివాసాలకు మధ్యలో ఉన్న రూ.కోట్లు విలువైన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.



తిరుపతి అర్బన్ మండలం సుబ్బారెడ్డి నగర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు సిమెంట్ రాళ్లు సిద్ధం చేసిన కూటమి మూక

సృష్టిలో అమ్మ స్థానం అత్యున్నతం. అమ్మ గొప్పతనం వర్ణనాతీతం.. అమ్మ త్యాగం అనన్యసామాన్యం.. పురిటి నొప్పులను సైతం పంటి బిగువున భరిస్తూ బిడ్డకు జన్మనిస్తుంది. కంటికి రెప్పలా కాపాడుకునేందుకు ప్రాణం పెట్టేస్తుంది. అందుకే అమ్మను మించిన దైవం ఉండదు అంటారు. అయితే కొంతమంది తల్లులు అనివార్యకారణాలతో శిశువుకు ముర్రెపాలు అందించలేక తల్లడిల్లిపోతున్నారు. అలాంటి సమయంలో బిడ్డ ఆకలి తీర్చడమే కాకుండా రోగనిరోధకశక్తిని పెంచే తల్లిపాలను అందించేందుకు కొందరు అమ్మలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. అమ్మతనానికి మరింత వన్నె తీసుకువస్తున్నారు. ఈ ప్రక్రియకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నారు. గురువారం ఈ విశిష్ట నిధి తొలి వార్షికోత్సవం నిర్వహించనున్నారు.



ప్రసూతి ఆసుపత్రిలోని హ్యూమన్ మిల్క్ బ్యాంక్

మనసు నిండుగా.. మురిపాల పండుగ

- తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రిలో మదర్ మిల్క్ బ్యాంక్
- నవజాత శిశువులకు వరంలా విశిష్ట సేవలు
- పాల వితరణకు స్వచ్ఛందంగా వస్తున్న తల్లులు
- నేడే మిల్క్ బ్యాంక్ తొలి వార్షికోత్సవం
- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు

సేకరణ ఇలా...

స్వచ్ఛందంగా వచ్చే డోనర్స్ నుంచి తల్లి వయసు, డెలివరీ, ఆధార్‌కార్డుతో పూర్తి వివరాలను దరఖాస్తు రూపంలో నమోదు చేసుకుంటారు. అనంతరం తల్లి ఆరోగ్య సమాచారం సేకరించి అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తారు. తల్లి శరీరంపై టాటూస్ (పచ్చబొట్లు) ఉన్నా, బ్రెస్ట్ సమీపంలో మచ్చలు, ఇన్‌ఫెక్షన్స్ ఉన్నా, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బాలింతల నుంచి పాలు సేకరించరు. సంపూర్ణ ఆరోగ్యవంతులైన తల్లుల నుంచి మాత్రమే పాల సేకరణ చేస్తున్నారు. ప్రధానంగా హెచ్ఐవీ, హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్ఏజీ, వీడీఆర్ఎల్ పరీక్షలు ప్రతి తల్లికీ తప్పని సరిగా చేసి నెగటివ్ రిపోర్టు ఉంటేనే పాల డొనేషన్‌కు అనుమతిస్తున్నారు. ఈ క్రమంలోనే బాలింతలు తమ బిడ్డకు సరిపోగా మిగులు పాలను మాత్రమే డొనేట్ చేయాల్సి ఉంటుంది.

స్టోరేజ్ ఇలా...

ఆరోగ్యవంతులైన తల్లుల నుంచి సుమారు 200ఎమ్ఎల్‌కు పైబడి ఒక సిట్టింగ్‌లో పాలు సేకరిస్తారు. ఇందులో 10ఎమ్ఎల్ శాంపిల్ పాలను పరీక్షల నిమిత్తం మైక్రోబయోలజీ విభాగానికి పంపుతారు. మిగిలిన పాలను మిక్స్ చేసి రిఫ్రిజిరేటర్‌లో భద్రపరుస్తారు. అనంతరం యూవీ రేస్‌లో ఉంచి పూలింగ్ ప్రక్రియ కొనసాగిస్తారు. సుమారు 3గంటల పాటు శుద్ధి చేసి 62.4 టెంపరేచర్‌లో వేడి చేస్తారు. అనంతరం సుమారు అరగంట పాటు కూలింగ్ ప్రాసెసర్‌లో ఉంచుతారు. సుమారు ఆరు నెలలపాటు పాలు సురక్షితంగా ఉండేందుకు మిల్క్ బ్యాంకు అధికారులు. సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.



సేకరించిన పాలను ఫ్రిజ్లో భద్రపరుస్తున్న సిబ్బంది



పాలను దానం చేస్తున్న బాలింత

తిరుపతి తుడా : తల్లి పాలు అవసరం ఉన్న నవజాత శిశువులకు అవసరమైన పాలను మదర్ మిల్క్ బ్యాంకు అందిస్తుంది. అమ్మపాలు శిశువు ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో కీలకం, తల్లి పాల ప్రాధాన్యత తెలియకపోవడంతో కొందరు పిల్లలకు పాలిస్తే తమ శరీర ఆకృతి పాడైపోతుందని ఆవు, గేదె పాలను, మిల్క్ పౌడర్‌ను బాటిల్స్‌తో పట్టిస్తుంటారు. మరికొందరు బాలింతల విషయంలో శిశువుకు తగినంత పాలు లేకపోవడం, తల్లి అనారోగ్యం కారణంగా పాల వృద్ధి క్షీణిస్తుంది. ఇటువంటి వారికోసం మదర్ మిల్క్ కేంద్రం ఓ వరంగా పనిచేస్తోంది.

247లీటర్ల సేకరణ

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని తల్లి పాల కేంద్రంలో ఏడాదిగా సుమారు 247లీటర్ల పాలను సేకరించి సుమారు 3,475మంది శిశువులకు అందించారు. ప్రతి నెల సుమారు 23 నుంచి 25 లీటర్ల పాలను డోనర్స్ నుంచి సేకరిస్తున్నారు. పాలు డొనేట్ చేసిన తల్లులకు సుమారు 6రకాల డ్రైఫ్రూట్స్ అందించి ప్రోత్సహిస్తున్నారు. మదర్ మిల్క్ కావలసిన వారు, డోనర్స్ 8919469744 నంబర్‌లో సంప్రదించవచ్చు.

ఎలాంటి శిశువులకు అందిస్తారంటే...

డెలివరీ అయిన వెంటనే తల్లి చనిపోయిన శిశువులకు, 2కేజీల కంటే బరువు తక్కువగా పుట్టిన పిల్లలకు, తల్లి ఆరోగ్యంగా ఉండి చనుపాల ద్వారం (నిప్పిల్స్) మూసుకుపోయిన పాలు రాని పరిస్థితి ఏర్పడిన శిశువులకు, తల్లిపాలు పడని బిడ్డలకు, దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్న బాలింతల పిల్లలకు పాలు అందిస్తున్నారు. ఒక్కో ఫీడింగ్‌కు 30ఎమ్ఎల్ చొప్పున రోజుకు 12సార్లు పాలు ఇస్తారు. ఇలా ఒకటి నుంచి 6నెలల వరకు శిశువుకు పాలు అందిస్తారు.

శిశు మరణాల నివారణకే..



"శిశు మరణాలను తగ్గించాలనే సంకల్పంతోనే హ్యూమన్ మిల్క్ బ్యాంకుకు శ్రీకారం చుట్టాం. సుమారు రూ.35లక్షల వ్యయంతో ఏర్పాటు చేశాం. చాలా మంచి స్పందన వస్తోంది. ఇప్పటి వరకు 3,475 మంది పసికందుల గొంతు తడిపాం. వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశాం. – టి.దామోదరం, మిల్క్ బ్యాంక్ ప్రాజెక్ట్ చైర్మన్, తిరుపతి

ప్రాణం పోస్తోంది



ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ఎందరో నవజాత శిశువులకు ప్రాణం పోస్తోంది. తల్లిపాలు పడితే ఆ బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఆరోగ్యవంతమైన ఎదుగుదల ఉంటుంది. ఈ ప్రాధాన్యతను గుర్తించిన రోటరీ క్లబ్ నిర్వాహకులకు అభినందనలు. – డాక్టర్ పార్థసారథిరెడ్డి, సూపరింటెండెంట్ ,ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి

ఆనందంగా ఉంది



"హ్యూమన్ మిల్క్ బ్యాంకు ఏర్పాటు చేశారని, కొంతమంది తల్లులు ముందుకొచ్చి పాలను ఇస్తున్నారని తెలిసింది. నేను కూడా మిల్క్ బ్యాంకుకు మురిపాలను అందించాలని నిర్ణయించుకున్నాను. ఇంట్లో అందరూ కూడా సానుకూలంగా స్పందించారు. ఇప్పటివరకు మొత్తంగా 24 లీటర్లను అందించడం ఆనందంగా ఉంది. – నాగుల చైతన్య, ఏపీటీఓ -1,తిరుపతి

సంతృప్తిగా ఉంది



నేను మొదటి బేబీకి జన్మనిచ్చాను. నా బిడ్డకు అవసరమైన పాలు అందిస్తున్నాను. మిల్క్ బ్యాంకుపై మా అమ్మకు అవగాహన ఉంది. ఆమె ప్రోత్సాహంతో నేను రోజుకు 160 మిల్లీలీటర్ల చొప్పున పాలు డొనేట్ చేస్తూ వచ్చాను . ఇప్పటివరకు 22 లీటర్లు అందించా. శిశువుల ఆకలి తీర్చడం ఎంతో సంతృప్తిగా ఉంది. – డి.సుప్రజ, తిరుపతి

తల్లిపాలే తొలి వ్యాక్సిన్



నవజాత శిశువుకు తొలి వ్యాక్సిన్ తల్లి పాలే. గైనకాలజిస్టా తల్లిపాల శ్రేష్టతపై స్పష్టమైన అవగాహన ఉంది. నేను ఇప్పటివరకు 34 లీటర్లకు పైగా పాలను మిల్క్ బ్యాంకుకు అందించా. బాలింతలు తమ మిగులు పాలను ఇచ్చేందుకు ముందుకు రావాలి. పసికందుల ప్రాణరక్షణకు సహకారం అందించాలి. – డాక్టర్ సోనా తేజస్వి, గైనకాలజిస్ట్

టీటీడీ ప్రక్షాళన అంటే ఇదేనా?

- చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేసిన భూమన



భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లో తిరుమల పవిత్రతను మంటగలిపేశారని టీటీడీ బోర్డు మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. టీటీడీని ప్రక్షాళన చేస్తామని, శ్రీవారి వైభవాన్ని మరింత పెంచుతామని చంద్రబాబు ప్రగల్భాలు పలికారని ఆరోపించారు. అదనపు ఈఓ వెంకయ్యచౌదరి అధికారిలా కాకుండా చంద్రబాబు తొత్తులా వ్యవహరిస్తూ మంత్రి లోకేష్ పీఏ సాంబశివరావు సిఫార్సు చేసే లెటర్లతో వీఐపీ దర్శనాల దందా సాగిస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేవలం రోజుకు 4వేలు మాత్రమే వీఐపీ దర్శనాలు కల్పించి సామాన్య భక్తులకు పెద్దపీట వేశామని గుర్తుచేశారు. ఇప్పుడు సామాన్య భక్తులను గాలికి వదిలేసి వీఐపీల సేవలో టీటీడీ అధికారులు మునిగితేలుతున్నారని విమర్శించారు. తిరుమలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్రమైన శ్రీవారి లడ్డూలో ఆవు కొవ్వు కలిపారంటూ దుష్ప్రచారం చేయడం, వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో ఆరుగురు మృతి చెందడం, శ్రీవారి ఆలయం ఎదుట బిర్యానీ, గుడ్లు తెచ్చుకుని తినడం, విచ్చలవిడిగా మద్యం, మత్తు పదార్థాలు గంజాయి వినియోగించడం, తిరుమలలో నాలుగుసార్లు ఎర్రచందనం పట్టుబడడం, పవిత్రమైన పాపనాశనం జలాల్లో బోటింగ్ పెట్టడం వంటి అనేక పాపాలకు చంద్రబాబే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పేదల గుండెల్లో జగనన్న

సంక్షేమ పథకాల ద్వారా రూ. 3లక్షల కోట్లు అందించి పేదల గుండెల్లో స్థిరంగా నిలిచిపోయిన నాయకుడు జగనన్న అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తర్వాత ఒక్క పేద వాడికీ మేలు చేయని ప్రజాద్రోహి చంద్రబాబు అని ఆరోపించారు. తిరుమల పవిత్రత మంటగలుస్తున్నా, పేదలకు సంక్షేమ పథకాలు అందక అలమటిస్తున్నా తనకేమీ పట్టనట్లుగా సనాతన ధర్మ పరిరక్షకుడు పవనానందస్వామి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కూటమి అరాచకపాలనపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, త్వరలోనే బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదకరమైన ఉత్పత్తులను తయారు చేస్తున్న ఫ్యాక్టరీల్లో కార్మికులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే నష్ట నివారణకు అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ శాఖలు సమష్టిగా కృషి చేయాలని వెల్లడించారు.డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ సుధాకర్ రావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ రమణయ్య, శ్రీ కాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

హైవే పనులు వేగవంతం

మల్లవరం-నాయుడుపేట మార్గంలో పెండింగ్‌లో ఉన్న హైవే పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జేసీ శుభం బన్సల్‌తో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్చువల్‌గా చెన్నైకి చెందిన జాతీయ రహదారి పీడీ రవీంద్రరావు హాజరయ్యారు. ఇరిగేషన్ శాఖ ఈఈ వెంకటేశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై సమీక్ష

వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు. భూసారం పెంచేందుకు కొత్తగా వచ్చిన 30రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. 2025-26కు సంబంధించి జిల్లాలో 40వేల ఎకరాల్లో ఆ విత్తనాలను చల్లించాలని సూచించారు. అలాగే మత్స్యకారులకు రాయితీపై బోట్లు ఇప్పించాలని కోరారు. సముద్రంలో నాచు ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రొయ్యల చెరువుల అభివృద్ధికి ఉపాధి నిధులు వాడుకోవాలని కోరారు. ఉద్యానశాఖ అధికారులు వ్యాపార పంటలను ప్రోత్సహించాలని చెప్పారు.పశుసంవర్థక శాఖ అధికారులు పాడి రైతులకు పశుగ్రాసాలపై అవగాహన కల్పించాలని వెల్లడించారు. వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు, ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, మత్స్యశాఖ అధికారి నాగరాజు, పశుసంవర్ధకశాఖ అధికారి రవికుమార్, ప్రకృతి వ్యవసాయ అధికారి షణ్ముగం పాల్గొన్నారు.

టూరిజంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా కల్యాణి డ్యామ్, చంద్రగిరి కోటతోపాటు ముఖ్యమైన ప్రాంతాలను ఎంపిక చేసి టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. టూరిజం అధికారులు రమణప్రసాద్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- సీమ పందుల పెంపకంపై శిక్షణలో వెటర్నరీ పరిశోధక, విస్తరణ సంచాలకులు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, శాస్త్రవేత్తలు

తిరుపతి సిటీ: యువతను, ఔత్సాహికులను, రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే వెటర్నరీ వర్సిటీ లక్ష్యమని పరిశోధక, విస్తరణ సంచాలకులు డాక్టర్ శ్రీలత, డాక్టర్ శోభామణి అన్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో సీమ పందుల పెంపకంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా డాక్టర్ శ్రీలత, డాక్టర్ శోభామణి మాట్లాడారు. లాభసాటి పారిశ్రామిక రంగంలో పందుల పెంపకం ఒకటిగా చెప్పవచ్చన్నారు. పందుల పెంపకంతో ఎంతోమంది పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారని తెలిపారు. ఔత్సాహికులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను అనుసరించి ఫామ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుజాత, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ గంగరాజు, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మంజురి, తెలంగాణ, ఆంధ్ర నుంచి సుమారు 40మంది రైతులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువకులు పాల్గొన్నారు.

6న దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

తిరుపతి సిటీ: తిరుపతి మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈనెల 6న ఉమ్మడి చిత్తూరు జిల్లా దివ్యాంగుల క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్లు దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల దివ్యాంగులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు జిల్లా కన్వీనర్‌ను 9985882559, 7780167625 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డీడీఈ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీయూ దూరవిద్య విభాగం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో వర్సిటీ వీసీ ఆచార్య సీహెచ్ అప్పారావు పుత్తూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. వీసీ మాట్లాడుతూ యుజీసీ డెబ్ నిబంధనలకు లోబడి పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

స్లాట్ రిజిస్ట్రేషన్

- రేపటి నుంచే బుకింగ్ విధానం అమలు

తిరుపతి అర్బన్ : ఆస్తుల క్రయవిక్రయాలకు ప్రభుత్వం నూతన విధానం ప్రవేశపెట్టింది. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్లాట్ బుకింగ్‌కు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు శుక్రవారం నుంచి ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకోవాంటే స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ముందుగా తిరుపతిలో తొలి రోజు ఈ విధానం అమలు చేయనున్నారు. ఇందుకోసం ఓ సీనియర్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేశారు. తిరుపతి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఓ కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. తర్వాత వరుసగా జిల్లాలోని 15సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోను ఇదే పద్ధతిని అమలు చేయనున్నారు. ఈ క్రమంలోనే తిరుపతి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ నీరజ నేతృత్వంలో ఏర్పాట్లు చేపట్టారు. పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య స్లాట్స్‌ను బుక్ చేసుకోవచ్చు. అనంతరం నిర్దేశించిన సమయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా గంటకు ఆరు రిజిస్ట్రేషన్లకు వీలుగా స్లాట్స్ కేటాయించనున్నారు. ఒక సబ్ రిజిస్ట్రార్ ఉన్న కార్యాలయంలో గరిష్టంగా 39 స్లాట్స్, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉన్నచోట గరిష్టంగా 78 స్లాట్స్‌ను రోజుకు అందించనున్నారు. క్రయవిక్రయదారులు పబ్లిక్ డేటా ఎంట్రీ సిస్టమ్ ద్వారా అధికారిక వెబ్‌సైట్‌గా ఉన్న రిజిస్ట్రేషన్.ఏపీ.జీవోవీ.ఇన్ లోని స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. లేదా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకునే సౌకర్యం కల్పించారు. తిరుపతిలో అదనపు సమాచారం కోసం హెల్ప్ డెస్క్ నంబర్ 9885378880 ఏర్పాటు చేశారు.



తిరుపతి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద స్లాట్ బుకింగ్ బోర్డు

బుకింగ్‌కే తొలి ప్రాధాన్యత

“ ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కచ్చితంగా స్లాట్స్ బుకింగ్ చేసుకున్న వారికే తొలి ప్రాధాన్యత ఉంటుంది. ఈ మేరకు జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ముందుగా తిరుపతిలో ప్రారంభిస్తున్నాం. తర్వాత జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మొదలుపెడతాం. సాయంత్రం 5.30 తర్వాతే స్లాట్ బుకింగ్ చేయని వారికి రిజిస్ట్రేషను చేయాల్సి ఉంటుంది.

– శ్రీరామకుమార్, జిల్లా రిజిస్ట్రార్, తిరుపతి

భగవంతునికి చేరువ చేసేది ఆగమశాస్త్రమే!

తిరుపతి సిటీ: అర్చకులను భగవంతుని సేవకు చేరువ చేసేది ఆగమశాస్త్రమేనని ఎస్ఎస్‌యూ ప్రొఫెసర్ సీ.రంగనాథన్ అన్నారు. ఎస్వీ వేదిక్ వర్సిటీలో 21 రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సిద్ధాంత కార్యశాల బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా రంగరాథన్ మాట్లాడారు. ఆగమశాస్త్రంలోని రహస్యాలను తెలుసుకోవాలంటే వర్క్‌షాపులు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. దైవారాధన క్రియలలో లోతైన జ్ఞానాన్ని పొందడం వల్ల లోకానికి మంచి జరుగుతుందన్నారు. శ్రీకాళహస్తి ప్రధాన అర్చకులు పరశురామ గురుకుల్ శివ అద్వైతం, అర్చన ప్రక్రియలో సిద్ధాంత స్వరూపం గురించి వివరించారు. అనంతరం వీసీ రాణి సదాశివమూర్తి వర్క్‌షాపు ప్రాధాన్యతను తెలియజేశారు.



మాట్లాడుతున్న ఆచార్య రంగనాథన్

రిజిస్ట్రార్ భాస్కరుడు, డీన్ రాజేష్‌కుమార్, సహ సంచాలకులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ భరత్ శేఖరాచార్యులు, డాక్టర్ కార్తికేయన్, డాక్టర్ టీ.బ్రహ్మాచార్యులు, అధ్యాపకులు, పండితులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఉబర్’ సమస్యల పరిష్కారానికి వినతి

తిరుపతి మంగళం : ఉబర్ సంస్థ కారణంగా తలెత్తిన సమస్యలు పరిష్కరించాలని వాహన యజమానులు కోరారు. బుధవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఉబర్ వాహన యజమానులతో డీటీడీఓ మురళీమోహన్ సమావేశం నిర్వహించారు. ప్రయాణ చార్జీలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని విన్నవించారు. తిరుపతి రైల్వే స్టేషన్, విమానాశ్రయంలో పార్కింగ్ ఇబ్బందులను తొలగించాలన్నారు. ఉబర్ సంస్థ వైఖరికి నిరసనగా సమ్మె చేస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీటీఓ మాట్లాడుతూ ఉబర్ వాహన యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంవీఐ సుబ్రమణ్యం,



మాట్లాడుతున్న డీటీఓ మురళీమోహన్

శ్రీనివాసరావు, మోహన్ కుమార్, పరిపాలనాధికారి విజయ ప్రశాంతి, సీనియర్ సహాయకుడు చరణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత భవిత



పాలిసెట్, ఏపీఆర్‌జేసీపై అవగాహన కల్పిస్తున్న విశ్వనాథరెడ్డి

- పాలిసెట్, ఏపీఆర్‌జేసీ అవగాహన సదస్సుకు స్పందన

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సు చేస్తే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి అన్నారు. బుధవారం ఆ విద్యాసంస్థలో నిర్వహించిన పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ నమూనా పరీక్ష, అవగాహన సదస్సుకు మంచి స్పందన లభించింది. ఆయన మాట్లాడుతూ, పాలిటెక్నిక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్, మైనింగ్, కెమికల్, బయోమెడికల్, మెటలర్జి, త్రీడి యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, పెట్రోలియం, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ రిఫ్రిజరేటర్ అండ్ ఎయిర్ కండిషనర్, ఫ్యాషన్ టెక్నాలజీ వంటి కోర్సులు ఉన్నాయన్నారు. పాలిటెక్నిక్ విద్యార్హతతో ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్, ఆర్‌అండ్‌బీ, రైల్వే, బెల్, బీఎస్ఎన్ఎల్, ఆర్టీసీ, విద్యుత్ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోను, అలాగే కార్పొరేట్ సంస్థల్లోనూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, వీటిలో డిప్లొమో చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా పాలిసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారని, దీనికి దరఖాస్తు చేసుకోవడానికి 15వ తేదీ ఆఖరు అని, అలాగే ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఈ నెల 25వ తేదీ ఉంటుందని, దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 6వ తేదీ ఆఖరు అని తెలిపారు. గత 35ఏళ్లుగా సైనిక్, నవోదయ, పాలిటెక్నిక్, ఏపీ ఆర్‌జేసీ వంటి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ ఆయా విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందుతున్నట్లు చెప్పారు. ఆయా పోటీ పరీక్షలకు సంబంధించి పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. సదస్సులో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 72,981 మంది స్వామివారిని దర్శించుకోగా 21,120 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 5.09 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టోక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టోక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని, కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి కార్మికుడి మృతి



నాగరాజు మృతదేహం

సూళ్లూరుపేట : పట్టణంలోని కస్వారెడ్డిపాళెం కాలనీ (కేఆర్‌పీ కాలనీ)లో బుధవారం సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తూ అందులో పడి ఎద్దల నాగరాజు (41) అనే కార్మికుడు మృతి చెందాడు. వివరాలు.. నాగరాజు సుమారు 15 ఏళ్లుగా షార్‌లో కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. తహసీల్దార్ నరసింహారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీసి షార్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపారు.

‘భవిత’ విద్యార్థికి కలెక్టర్ చేయూత

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల పరిధిలోని భవిత కేంద్రం విద్యార్థి వడ్లమూడి రమేష్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్ చేయూతనందించారు. బుధవారం ఈ మేరకు రూ.50వేలు విలువైన బ్యాటరీ మోటార్ సైకిల్‌ను సొంత నిధులతో కొనుగోలు చేసి అప్పగించారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఈఓ కేవీఎన్ కుమార్, భవిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న కేసుల్లో 17 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారని కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి జరిమానా విధించినట్లు వివరించారు.

రీసెర్చ్ అసోసియేట్ పోస్టుకు ఇంటర్వ్యూ

తిరుపతి తుడా : స్విమ్స్ వర్సిటీ న్యూరాలజీ విభాగంలో రీసెర్చ్ అసోసియేట్‌గా ఆరునెలల పాటు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్క పోస్టు మాత్రమే ఉందని, ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 9వ తేదీన స్విమ్స్ పాత డైరెక్టర్ కార్యాలయంలోని కమిటీ హాల్‌లో హాజరు కావాలని కోరారు. అర్హతలు, దరఖాస్తు ఫారం కోసం స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

న్యూసెన్స్ చేస్తే సహించం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, ప్రజలను ఇబ్బంది పెట్టేలా న్యూసెన్స్ చేసినా సహించే ప్రసక్తే లేదని రేణిగుంట ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని స్పష్టం చేశారు.

పోలీసుల అదుపులో కిడ్నాపర్లు?

తిరుపతి క్రైమ్ : తిరుపతిలో కలకలం రేపిన కిడ్నాప్ కేసును పోలీసులు ఛేదించినట్లు సమాచారం. ఆదివారం కిడ్నాప్‌నకు గురైన రాజేష్ కుటుంబం సభ్యులు సుమతి, విజయలక్ష్మి, యోషిత, జోషితలను పోలీసులు కాపాడారు. కిడ్నాపర్ భార్గవ్ వారి స్నేహితుల ఆచూకీ కోసం బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ కేసులో నిందితలను అరెస్టు చేసిన సమాచారం. గురువారం వీరిని మీడియా ముందు ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తిరుపతి క్రైమ్ : తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. బుధవారం ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సుమారు 45 నుంచి 50 ఏళ్ల వ్యక్తి మృతదేహం రైల్వే స్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై పడి ఉంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

మహిళ ఆత్మహత్య

వాకాడు : స్థానిక బజారు వీధిలో అమిర్తి జ్యోతి(38) అనే మహిళ బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. శ్రీకాకుళం జిల్లా కొత్తపట్నం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన అమిర్తి జ్యోతి, భర్త దిలీప్ గత 15 ఏళ్లుగా వాకాడులో కాపురం ఉంటున్నారు.పరిసర ప్రాంతాల్లో బేల్దారు పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే మంగళవారం రాత్రి భార్య భర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో జ్యోతి పురుగు మందు తాగేసింది. వాకాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. పోస్టు మార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు వెల్లడించారు.

పచ్చమూక చెరలో చింతగుంట చెరువు



చింతగుంట చెరువులోని మట్టిని అక్రమంగా తవ్వేసిన దృశ్యం

- భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు
- గొల్లపల్లెలోని వెంచర్‌కు అక్రమ తరలింపు
- రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా రవాణా

చంద్రగిరి : ప్రకృతి సంపదను అధికార పార్టీ నేతలు అడ్డగోలుగా కొల్లగొడుతున్నారు. ఇన్నాళ్లు ఇసుక అక్రమ రవాణానే ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్న పచ్చమూక, ఇప్పుడు గ్రావెల్‌పై పడ్డారు. ఏకంగా చెరువులోని మట్టిని భారీ యంత్రాలతో తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వివరాలు.. చంద్రగిరి మండలం శానంబట్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని చింతగుంట చెరువు పూర్తిగా పచ్చ నేతల చెరలోకి వెళ్లిపోయింది. తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెకు చెందిన ఓ నేత, పాతకాలువకు చెందిన మరో నేత కలిసి చింతగుంట చెరువుపై పడినట్లు స్థానికులు చెబుతున్నారు. మూడు రోజులుగా చెరువులోని మట్టిని గొల్లపల్లిలోని ఓ వెంచర్‌కు అక్రమంగా తరలించేస్తున్నారు.

ఒక్క రాత్రికి రూ.6లక్షలు

ప్రతి రోజూ రాత్రి 7.30 గంటల నుంచి గ్రావెల్ మాఫియా పడగ విప్పుతోంది. సుమారు 10 టిప్పర్ల ద్వారా ఒక్కో టిప్పర్ 10లోడ్ల చొప్పున సుమారు 100 లోడ్ల వరకు వెంచర్‌కు తరలిస్తున్నట్లుగా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ఒక్క రాత్రికే అధికార పార్టీ నేతలు సుమారు రూ.6లక్షల వరకు జేబులో వేసుకుంటున్నట్లు తెలుస్తోంది.



చెరువు నుంచి సి.గొల్లపల్లెలోని వెంచర్‌కు తరలించిన మట్టి

పైగా టిప్పర్లకు జాతీయ రహదారి పనుల స్టిక్కర్లను ఏర్పాటు చేయడం విశేషం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు

“ అనుమతి లేకుండా చెరువుల్లో మట్టి తవ్వడం చట్టరీత్యా నేరం. ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదు. చింతగుంట చెరువు రెండు మండలాలకు సరిహద్దుగా ఉంది. చెరువులో నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. పనులను అడ్డుకుని, వాహనాలను సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించాం. అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవు.

– శివరామసుబ్బయ్య, తహసీల్దార్, చంద్రగిరి

న్యాయం చేయాలని వినతి

తిరుపతి అర్బన్ : ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్, ఎల్‌పీజీ గ్యాస్ సెంటర్‌లో నాలుగు ఏళ్ల నుంచి పనిచేస్తున్నామని, అకారణంగా అధికారులు తొలగించారని, తమకు న్యాయం చేయాలని టర్మినేట్ అయిన ఉద్యోగులు కోరారు. బుధవారం ఈ మేరకు కలెక్టర్‌కు విన్నతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా సహకార శాఖ అధికారులు తమను రోడ్డుపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తమతో చెప్పినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తొలగింపునకు గురైన ఉద్యోగులు లక్ష్మీదేవి, స్రవంతి, సాగర్, గురవారెడ్డి, సుబ్రమణ్యం, సత్యవేలు, సయ్యద్‌బాషా, మునెయ్య, వెంకటేష్, తులసీప్రియ, నాగరాజు, రాజమోహన్, లోకేష్‌రెడ్డి, పరంధామ, జగదీష్, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



ఘటనాస్థలంలో ప్రయాణికులు

చంద్రగిరి : తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారిపై భాకరపేట కనుమలో బుధవారం ఆర్టీసీ బస్సు కొండను ఢీకొంది. చోటు చేసుకుంది. బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవరు చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు ముప్పు తప్పింది. అనంతరం ప్రయాణికులను మరో బస్సులో గమ్యానికి చేర్చారు.

‘వక్ఫ్’ బిల్లుపై ఆందోళన



నినాదాలు చేస్తున్న ముస్లిం నేతలు

తిరుపతి మంగళం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డ్ బిల్లుపై వైఎస్సార్‌సీపీ ముస్లిం నేతలు ఆందోళనకు దిగారు. బుధవారం ఈ మేరకు పద్మావతిపురంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ జోనల్ విభాగం అధ్యక్షుడు సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరి మాట్లాడుతూ ముస్లింల భూములను కొట్టేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలతో వక్ఫ్‌బోర్డ్ బిల్లును ప్రవేశపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విధంగా ఇతర కుల మతాలకు కూడా అన్యాయం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనకాడవని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం వక్ఫ్‌బోర్డ్ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిలకు మద్దతు తెలపడం అభినందనీయమన్నారు. కూటమి పాలనలో ముస్లింలకు చీకటి రోజులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఖాదర్‌బాషా, షేక్ ఇమ్రాన్, గఫూర్, హాజీ షేక్ ఫరీతాప్, షేక్ సలీమ్, ఎస్‌కే కలీమ్, ఎస్.అమీర్‌బాషా పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

పుత్తూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఈఎస్ టాస్క్ ఫోర్స్ సంయుక్తంగా బుధవారం చేసిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిచ వారి వద్ద నుంచి రూ.9,600 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ బి.మురళీమోహన్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. వడమాలపేట గ్రామంలోని గుంటకట్టవీధిలో నివాసమున్న వల్లెమ్మ(45) ఇంట్లో దాడి చేయగా ఇంట్లో 700 గ్రాముల గంజాయి దాచి ఉండగా గుర్తించి, దానితోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో వల్లెమ్మ(45), ఆమె కుమారుడు ఢిల్లీప్రసాద్(27)ను అరెస్టు చేశారు. వల్లెమ్మ గతంలోనూ గంజాయి కేసులో పట్టుబడి, ఏడాది జైలుశిక్ష అనుభవించి విడుదలైంది. ఈమెపై నిఘా ఉంచడంతో మళ్లీ గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు పక్కా సమాచారంతో దాడి చేసి అరెస్టు చేశారు. దాడుల్లో సీఐ మురళీమోహన్, ఎస్ఐలు శివప్రసాద్, స్వామినాధన్, సిబ్బంది రవి, చంద్రశేఖర్, మునిరెడ్డి, డేవిడ్, చిరంజీవి, మోహతాజ్, హారతిలు పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు